
Insan Apne Aapku Pahchaan (Telugu)

# నిన్ను నీవు తెలుసుకో!

MAULANA WAHIDUDDIN KHAN




# Explore our Digital Resources




### Goodword Quran App
Download the free app and access the complete text and audio of the Quran in numerous languages





### Ebooks
Inspire yourself with a range of free ebooks on peace and spirituality





### Audiobooks
A range of free audiobooks to keep you inspired and motivated


# Books on Peace and Spirituality




### The Seeker's Guide
Questions on God, Islam, peace, spirituality and wisdom.




### Discovering God
Discover God and His attributes by reflecting on nature, universe and life's events.




### Leading A Spiritual Life
The art of spirituality is to extract food for the soul from life's different circumstances.

Insaan Apne Aapku Pahachaan
(Telugu)

# నిన్ను నీవు తెలుసుకో!

మూలం

**మౌలానా వహీదుద్దీన్ ఖాన్**

అనువాదం

**అబ్దుల్ వాహెద్**

**GOODWORD BOOKS**
Web : www.goodwordbooks.com
www.goodword.net

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ...

# నిన్ను నీవు తెలుసుకో!

## అతి పెద్ద సమస్య

సమాజంలో మనిషి ముందున్న అతిపెద్ద సమస్య ఏది అని అడిగితే అనేకులు అనేక విధాల జవాబిస్తారు. అణ్వాయుధాల ప్రయోగాలు ఆగిపోవాలని కొందరంటే, పెరుగుతున్న జనాభా అతి పెద్ద సమస్యని మరికొందరంటారు. ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థను క్రమబద్ధం చేయాలని, అదే మానవుల అతిపెద్ద సమస్యని ఇంకొదరంటారు. ఇలా వివిధ రకాల జవాబులు వినవస్తాయి. ఇలాంటి జవాబులు ద్వారా మనిషి తనను తాను తెలుసుకోలేదని స్పష్టమవుతుంది. మనిషికి తన పట్ల సరియైన అవగాహన ఉన్నట్లయితే అందరి సమాధానాలు ఒకేలా ఉండేవి. మనిషి తనను గురించిన 'వాస్తవాన్ని' మరచిపోయాడు. ప్రతి మనిషికి ఓ రోజు మరణం తప్పదు. మరణానంతరం తన ప్రభువు సమక్షంలో హాజరయి ప్రాపంచిక కర్మలకు లెక్క చెప్పవలసి ఉందన్న వాస్తవాన్ని మనిషి మరిచిపోయాడు. ఈ సత్యాన్ని గనుక మనం అర్థం చేసుకొన్నట్లయితే, మన ముందున్న ప్రపంచం ఓ సమస్యగా కనబడదు. పరలోకమే ప్రధాన సమస్యగా కానవస్తుంది.

నేటికీ ప్రపంచంలో అధిక సంఖ్యలో ప్రజలు దైవాన్ని, ప్రళయ దినాన్ని విశ్వసిస్తున్నారు. అందరూ నాస్తికులై పోయారని కాదు. కాని వాళ్ళ విశ్వాసానికి, నిత్య ఆచరణలతో సంబంధం లేదు. జీవితంలో ప్రతి మనిషి

ముందున్న ప్రశ్న ఒక్కటే ప్రాపంచిక జీవనంలో ఎలా పురోగతి సాధించాలా అన్నదే.

భూమి తన ఆకర్షణ శక్తిని కోల్పోయిందని, గంటకు ఆరువేల మైళ్ళ వేగంతో సూర్యుని వైపు ఆకర్షించబడుతుందనీ మన అంతరిక్ష పరిశోధకులు గనుక ప్రకటించారనుకోండి. పూర్తి ప్రపంచంలో అల్లకల్లోలం చెలరేగుతుంది. ఎందుకంటే, ఇలాంటి వార్తకు అర్థం కొన్ని రోజులలో భూమిపై ఉన్న అన్ని రకాల జీవం నాశనమైపోతుందని. ఈ ప్రపంచం అంతకన్నా పెద్ద ప్రమాదంలో కొట్టుకుపోతుంది. కాని ఆ ప్రమాదానికి భయపడే అవసరం గుర్తించిన వాళ్ళు ఎవరూ కనబడటం లేదు. ఆ ప్రమాదమేమంటే, ప్రళయదినం రావడం. భూమ్యాకాశాలు పుట్టిననాడే నిర్ణయమై ఉన్న రోజది. ఆ ప్రళయదినం వైపునకు మనమంతా తీవ్ర వేగంతో ప్రయాణిస్తున్నాము. ఈ వాస్తవాన్ని ధార్మిక విశ్వాసంగా అందరూ అంగీకరిస్తున్నారు. కాని ఈ ప్రళయదినం గురించి గంభీరంగా ఆలోచించవలసిన అవసరాన్ని గుర్తించిన వాళ్ళు అతి తక్కువ.

సాయంత్రం పూట ఏదైనా బజారులో మీరు నిలబడ్డారనుకోండి. అక్కడ ప్రజలు దేనికోసం తాపత్రయపడుతున్నారో పరిశీలించారనుకోండి. అప్పుడు మీకు నేటి మనిషి దేన్ని అసలు సమస్యగా పరిగణిస్తున్నాడో స్పష్టంగా అర్థమవుతుంది. రోడ్డుపై అటూ యిటూ శరవేగంగా పోయే వాహనాల దౌడు ఎందుకోసం? దుకాణాలను అలంకరించి వ్యాపారులు కూర్చున్నదెందుకు? గుంపులు గుంపులుగా మనుష్యులు ఎక్కడికి వెళుతున్నారు? ప్రజల మధ్య సంభాషణల్లో నలిగే అంశాలేవి?ఒకరినొకరు ఏ ప్రయోజనం కోసం కలుస్తున్నారు? ఏ అంశాల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు? ప్రజల శక్తి సామర్థ్యాలు, జేబులోని డబ్బులు ఏ లక్ష్యం కొరకు ఖర్చవతున్నాయి? సంతోషంగా ఉన్నవాళ్ళు దేన్ని పొంది సంతోషిస్తున్నారు? విచారవదనాలతో

ఉన్నవాళ్ళు ఏది లేదని బాధపడుతున్నారు? ప్రజలు తమ ఇళ్ళ నుంచి ఏది తీసుకొని బయల్దేరారు? ఏది తీసుకొని ఇంటికెళ్ళాలని ఆలోచిస్తున్నారు? ప్రజల కార్యకలాపాలను, వారి మాటలను, వారి చేష్టలను గమనిస్తే పై ప్రశ్నలకు జవాబులు సునాయాసంగా లభ్యమవుతాయి. నేడు మనిషి దేన్ని అతి పెద్ద సమస్యగా తలపోస్తున్నాడో అర్థమవుతుంది. ఏది పొందాలని భావిస్తున్నాడో తెలియవస్తుంది. నిజం చెప్పాలంటే బజారుల్లో హడావుడి, రోడ్లపై ప్రజల రాకపోకల ద్వారా నేటి మనిషి మనోకాంక్షల వెనుక పరుగెడుతున్నాడని తెలియవస్తుంది. మనిషి పరలోకాన్ని కాదు, కేవలం ప్రపంచాన్ని పొందాలని చూస్తున్నాడు. ప్రాపంచిక కాంక్షలు పూర్తయితే సంతోషిస్తున్నాడు. ప్రాపంచిక కాంక్షలు పూర్తయ్యే ఆశ కనబడకపోతే బాధపడుతున్నాడు. నేటి అవసరాలు, నేటి సౌఖ్యం, నేటి గౌరవం, నేటి ప్రతిష్ఠ, నేటి అవకాశాలు – ఇవే ముఖ్యం. వీటిని పొందినవాడు పురోభివృద్ధి సాధించినట్లు, పొందలేనివాడు విఫలమయినట్లు వీటి వెనుకే సమస్త మానవాళి పరుగెడుతుంది. రానున్న రోజు గురించి ఆలోచన ఎవరికీ లేదు. ప్రతి మనిషి కేవలం 'నేడు' గురించే పిచ్చి వాడిలా ప్రాకులాడుతున్నాడు.

పెద్ద పెద్ద నగరాల్లోని పరిస్థితి మాత్రమే కాదు ఇది. నలుగురు మనుష్యులు ఉన్న ప్రతి చోట పరిస్థితి ఇలానే ఉంది. ఎవరినన్నా చూడండి. అతగాడు తన గురించిన ఆలోచనలలోనే మునిగి కనబడుతాడు. స్త్రీ పురుషులైనా, ధనిక బీదలైనా, వృద్ధులైనా యువకులైనా, చదువుకొన్నవాడైనా నిరక్షరాస్యుడైనా, నగరవాసి అయినా పల్లెటూరి వాడయినా చివరికి ఆస్తికుడైనా నాస్తికుడైనా అందరూ ఇదే దిశగా పరుగెత్తుతూ పోతున్నారు. ప్రపంచంలో ఎంతగా సౌఖ్యాలు పొందే వీలుంటే అంతగా పొందడమే నేటి మనిషికి ఉన్న ఏకైక లక్ష్యం, ఇదే తన పని అనుకొంటున్నాడు. దాని కోసమే తన

సమయాన్ని, తన శక్తిసామర్థ్యాలను వెచ్చిస్తున్నాడు. ఈ ఆలోచనలలోనే రాత్రింబవలు మునిగి ఉంటున్నాడు. చివరికి మనస్సాక్షిని, విశ్వాసాన్ని పణంగా పెట్టి ప్రపంచాన్ని పొందడానికి సిద్ధపడుతున్నాడు. ఏ విధంగానయినాసరే ప్రపంచాన్ని పొందాలనుకొంటున్నాడు.

కాని ఇలాంటి అభిలాషలు, ఈ పురోభివృద్ధి కేవలం ప్రాపంచికమైనది మాత్రమే. ప్రళయదినాన పనికి వచ్చేది కాదు.

నేటి ప్రపంచంలో పురోభివృద్ధి సాధించడానికి పరలోకాన్ని విస్మరించిన వ్యక్తిని యవ్వనంలో వృద్ధాప్యం కొరకు ఏదీ దాచుకొనని వ్యక్తితో పోల్చవచ్చు. అలాంటి వ్యక్తి శక్తులుడిగిన, బలహీన పడిపోయి నప్పుడు అతడికి ఆశ్రయమేదీ లేదని తెలియవస్తుంది. తన వద్ద ఇల్లు లేదనీ, అతడు తెలుసుకొంటాడు. కాని తన కోసం ఇంటిని నిర్మించు కోలేడు. శీతల వాతావరణం నుంచి రక్షించే దుస్తులు దుప్పట్లు లేవని తెలుసుకొంటాడు. కాని దుస్తులు దుప్పట్లు కొనేపాటి సొమ్ము అతడి వద్ద ఉండదు. ఆహార పానీయాల అవసరాలు తీర్చుకోడానికి ఏమీ చేయలేడు. నిరాశతో అతడు ఏ గోడవారనో కూలబడి ఉంటాడు. అతడ్ని చూసి కుక్కలు మొరుగుతూ ఉ ంటాయి. పిల్లలు రాళ్ళు విసురుతుంటారు. మనం ఇలాంటి ఉదాహరణలను కళ్ళారా చూస్తునే ఉన్నాం. పరలోకం కోసం ఏర్పాట్లు చేసుకోని వ్యక్తికి పరలోక జీవనం ఎలా ఉంటుందో ఇలాంటి ఉదాహరణల ద్వారా ఊహించుకోగలం. అయినా మనలో ఎలాంటి మథనం కలగడం లేదు. మనలోని ప్రతి వ్యక్తి కేవలం నేటి జీవనం కోసం మాత్రమే చింతిస్తున్నాడు. రేపటి కోసం ఆలోచించడం లేదు.

యుద్ధకాలంలో వైమానిక దాడుల సైరన్ మ్రోగినప్పుడు, శత్రు విమానాలు గుంపులు గుంపులుగా బాంబుల వర్షం కురింపిచడానికి

వస్తున్నాయిని కొద్దిసేపటిలో నగరాన్ని అగ్నిగుండంగా మార్చనున్నాయని ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలాలని భయానకమైన ప్రకటన వెలువడిన మరుక్షణం ప్రజలు దగ్గరలో ఉన్న సురక్షిత ప్రాంతం వైపు పరుగిడుతారు. మనుష్యులతో క్రిక్కిరిసిన బజార్లు రోడ్లు రెప్పపాటులో నిర్మానుష్యమైపోతాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రాణాలు రక్షించుకోడానికి సురక్షిత ప్రాంతంలో తలదాచుకోని వ్యక్తిని మూర్ఖుడని లేదా పిచ్చివాడని అంటారు. ప్రపంచంలో ఎదురైన ఓ చిన్న ప్రమాదంపై ప్రజల ప్రతిస్పందన ఇది. అయితే ఇంతకన్నా అతి పెద్దది, తప్పనిసరిగా వాటిల్లేది అయిన ప్రమాదం మరొకటుంది. ఈ ప్రమాదం గురించి విశ్వప్రభువు స్వయంగా హెచ్చరించాడు. దైవం తన ప్రవక్తల ద్వారా ఈ సందేశాన్ని పంపాడు. ప్రజలారా! నన్ను ఆరాధించండి. ఒండొరుల హక్కులను నెరవేర్చండి. నా అభీష్టం ప్రకారం జీవితాన్ని గడపండి. ఇలా చేయని వాళ్ళను వాళ్ళు ఊహించలేనంతటి కఠిన శిక్షకు గురిచేస్తాను. ఆ శిక్ష నుంచి వాళ్ళు ఎన్నడూ తప్పించుకోలేరు. ఈ హెచ్చరికను అందరూ విన్నారు. ప్రతి వ్యక్తి ఈ విషయాన్ని ఏదో ఒక రీతిన అంగీకరిస్తున్నాడు. కాని ఇదేమంత పట్టించుకోదగ్గది కానట్లు ఉంది ప్రజల ధోరణి. ప్రాపంచిక లాభాల కోసం చేయరాని పనులన్నీ చేస్తున్నారు. నిషిద్ధ మార్గాన అతివేగంగా పరుగెత్తుతున్నారు. సైనిక ప్రధాన కార్యాలయాల నుంచి మ్రోగిన వైమానిక దాడుల సైరన్ విన్న వెంటనే ప్రజలు పరుగెడుతారు.కాని, విశ్వప్రభువు తరఫు నుంచి వచ్చిన ప్రమాద హెచ్చరికల గురించిన ఆందోళన ఎవరికీ లేదు.

ఈ మనస్తత్వానికి కారణమేమిటి? వైమానిక దాడుల సైరన్ హెచ్చరించే ప్రమాదం ప్రపంచానికి సంబంధించినది. దాన్ని మనిషి తన కళ్ళతో చూస్తున్నాడు. ఫలితాలను వెంటనే అంచనా వేయగలడు. కాని దైవం

తరఫున వచ్చిన ప్రమాద హెచ్చరిక మరణం తరువాత అనుభవానికి వచ్చేది. మనకు దైవానికి మధ్య మరణం అనే గోడ అడ్డువుంది. మన కళ్ళకు ఆ ప్రమాదం కనబడదు. మనం ఆ ప్రమాదాన్ని తెచ్చే విమానాలను చూడలేం. బాంబుల్ని గాని, అగ్ని వర్షాన్నిగాని ప్రస్తుతం చూడలేం. వైమానిక దాడుల సైరన్‌పై ప్రజలు వెంటనే విశ్వసిస్తారు. కాని దైవం హెచ్చరించిన ఆ ప్రమాదం గురించి విన్నప్పటికీ ఎలాంటి చలనం రావడం లేదు. ఈ దైవిక హెచ్చరికను పట్టించుకొనేంతటి విశ్వాసం మనకుండడం లేదు.

దైవం మనకు నుదుటి క్రింద ఉన్న రెండు కళ్ళు మాత్రమే ఇవ్వలేదు. ఈ కళ్ళు కేవలం ఎదురుగా ఉన్నవాటినే చూడగలవు. మన వద్ద మరో నేత్రముంది. ఇది చాలా దూరం వరకు చూడగలదు. ఈ నేత్రం దాగి ఉన్న వాస్తవాలను సయితం చూడగలదు. అది జ్ఞాన నేత్రం. దైవ హెచ్చరికలను ప్రజలు పెడచెవిన పెట్టడానికి కారణం వాళ్ళు ఈ నేత్రాన్ని ఉ పయోగించకపోవడమే. తమకు ఎదరుగా కనబడేదే వాస్తవమని వాళ్ళు భావిస్తున్నారు. కాస్త ఆలోచించి చూచినట్లయితే మన ఎదురుగా కనబడే దానికన్నా, మనం చూడలేనిదే సత్యమయ్యే అవకాశాలున్నాయని తెలుస్తుంది.

ఈ విశ్వంలో ప్రతి మనిషి ఒప్పుకునే వాస్తవం ఏది అని ప్రశ్నిస్తే దానికి జవాబు ఒక్కటే. అది మరణం. మరణం అనేది ప్రతి ఒక్కరూ ఒప్పుకుని తీరవలసిన వాస్తవం. ప్రతి ఒక్కరికి తెలుసు ఏదో ఓ సమయంలో మృత్యువు తప్పదని. అయితే మృత్యువు గురించిన ఆలోచన వచ్చినప్పుడు సాధారణంగా నా తరువాత నా పిల్లల పరిస్థితి ఏమవుతోందో? అని మాత్రమే ఆలోచిస్తారు. మరణానికి ముందు తమ జీవితం గురించి చాలా ఆలోచిస్తారు. మరణించే ముందు కూడా పిల్లలు, ఇల్లు అన్న చింత ఉంటుంది. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి యావజ్జీవితం వెచ్చిస్తారు. కాని తాము స్వయంగా

ఎదుర్కోబోతున్న భవిష్యత్తును చక్కదిద్దుకోడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయరు. తమ మరణానంతరం కేవలం పిల్లల ఉనికి మాత్రమే ఉంటుందని, తమ ఉనికి ఉండదన్నట్లు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవలసిన అవసరం లేదన్నట్లు వ్యవహరిస్తారు.

ఈ ఆలోచనా ధోరణిని చూస్తే తెలియవచ్చేదేమంటే, మరణానంతరం జీవితం ఉందన్న స్పృహ బహుశా లేదనిపిస్తుంది. నిజం చెప్పాలంటే అసలు జీవితం మరణానంతరమే ఆరంభమవుతుంది. మరణం తరువాత సమాధి చేయబడినప్పుడు వాస్తవానికి వాళ్ళు మరో ప్రపంచంలోకి తీసుకొనిపోబడతారు. ఈ విషయం గనుక తెలిసి ఉంటే మరణించే ముందు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించే ముందు మరణం తరువాత తమ భవిష్యత్తేమి కానుందో అని ఆందోళన పడతారు.

ప్రస్తుత ప్రపంచంలో అధిక శాతం ప్రజలు వాళ్ళు ఆస్తికులయినప్పటికీ మరణానంతరం జీవితం గురించి విశ్వాసాన్ని కోల్పోయారు. ఆ జీవితం ప్రాపంచిక జీవితం కంటే ముఖ్యమైనదని, వాస్తవమైనదని, అందులో అడుగుపెట్టవలసి ఉంటుందన్న విశ్వాసాన్ని కోల్పోయాడు మానవుడు.

మరణానంతర జీవితంపై సందేహాలకు రెండు కారణాలున్నాయి. ఒకటి, ప్రతి మనిషి మరణించి మట్టిలో కలిసిపోతున్నాడు. మనిషి మరణించిన తరువాత మళ్ళీ ఎలా బ్రతుకుతాడన్నది సందేహంలో పడవేస్తుంది. రెండు, మరణానంతరం పరలోకం మన కళ్ళకు కనబడదు. ప్రస్తుత ప్రపంచాన్ని ప్రతి వ్యక్తి తన కళ్ళతో చూస్తున్నాడు. కాని పరలోకాన్ని ఇంతవరకు ఎవరూ చూడలేదు. అందువల్ల ఈ జీవితం తరువాత మరో జీవితం ఉందంటే నమ్మకం కుదరడం లేదు. ఈ రెండు సందేహాల గురించి ఆలోచిద్దాం.

## మరణానంతరం జీవితం

మరణం తరువాత పరలోకం అన్న ప్రశ్నకు 'మరణించి మట్టిలో కలిసిన తరువాత మళ్ళీ సజీవమవుతామా' – అని ఆలోచించేవారు చాలా తక్కువ. అయితే మరణం తరువాత మరో జీవితం ఉందని దృఢంగా విశ్వసించని వ్యక్తి మనసులో ఈ ప్రశ్న తప్పక ఉంటుంది. నేటి ప్రపంచంలో పడి పరలోకం గురించి పట్టించుకోని వ్యక్తి ఈ ప్రశ్న ద్వారా పరలోకం గురించిన విశ్వాసం తనకు లేదని తెలియజేస్తున్నాడు.

బాగా ఆలోచించినట్లయితే ఈ వాస్తవం అతి సులభంగా అర్థమవుతుంది. మరణానంతరం ఎదురయ్యే వాస్తవాలను దైవం మనకు అగోచరంగా పెట్టాడు. ఎందుకంటే దైవం మనలను పరీక్షిస్తున్నాడు. విశ్వంలో అనేక దృష్టాంతాలు ఉన్నాయి. వాటి గురించి ఆలోచిస్తే వాస్తవం మనకు తెలుస్తుంది. ఈ విశ్వం ఓ అద్దం లాంటిది. ఇందులో పరలోక ప్రతిబింబం కనబడుతుంది.

మనం ప్రస్తుతమున్న రూపులో మొదటి నుంచీ లేము. మనిషి పుట్టుక ఓ రూపంలేని బిందువుతో మొదలవుతుంది. ఈ వీర్య బిందువు తల్లి గర్భంలో పెరిగి మానవ రూపం దాలుస్తుంది. ఆ మానవుడు తరువాత ప్రపంచంలోకి వచ్చి బాల్యం నుంచి అభివృద్ధి చెంది పూర్తిస్థాయి మనిషిగా ఎదుగుతాడు.

మామూలు కళ్ళకు కనబడనంత చిన్నదైన వీర్యబిందువు నుంచి నిలువెత్తు మనిషి రూపొందడం మనం కళ్ళారా చూస్తున్న సత్యం. అలాంటప్పుడు మన శరీర అవయవాలు చిన్న చిన్న కణాలుగా మట్టిలో కలసిపోయిన తరువాత కూడా మళ్ళీ మానవ రూపం పొందగలవని ఎందుకు నమ్మకూడదు?

ప్రతి మనిషి శరీరం వాస్తవానికి అనన్య కోట్ల పరమాణువుల నిర్మితం. ఈ పరమాణువులు భూమిలోనూ వాతావరణంలోనూ నిండి ఉన్నాయి. మరణానంతరం మానవ శరీరంలోని అణువులు పరమాణువులు విడిపోయినా

మళ్ళీ అవన్నీ కలసి శరీరాకృతిని పొందడంలో ఆశ్చర్యమేముంది? ఓసారి జరిగిన ఘటన పునరావృతం ఎందుకు కాదు? భౌతిక ప్రపంచంలో కూడా ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఈ ఉదాహరణల ద్వారా జీవితం మరోసారి పునరావృతం అవుతుందని తెలుస్తుంది. ప్రతి ఏడు వర్షాకాలంలో పంటలు పండుతాయి. నేల అంతా పచ్చని మొక్కలతో నిండి ఉంటుంది. వేసవి కాలం ఈ పచ్చని మొక్కలకు మృత్యువులా వస్తుంది. నేల అంతా ఎండిపోతుంది. పచ్చగా కళకళలాడిన నేల బీడువారుతుంది. ఈ విధంగా ఓ జీవితం పుట్టి మరణిస్తుంది. కాని మళ్ళీ వర్షరుతువు వచ్చినప్పుడు ఆకాశం నుంచి వర్షం కురిసినప్పుడు ఆ మరణించిన పచ్చదనం మళ్ళీ బ్రతుకుంది. బీడుపడిన భూమి మళ్ళీ సస్యశ్యామలమవుతుంది. ఇదేవిధంగా మనిషి కూడా మరణానంతరం బ్రతికింపబడతారు.

మరోకోణం నుంచి ఆలోచిద్దాం. మరణానంతరం జీవితం గురించి సందేహాలు కలగడానికి కారణం మన భౌతిక శరీరమే మన ఉనికికి నిదర్శనం అని భావిస్తున్నాం. సజీవంగా నడుస్తూ, తిరుగుతూ ఉండే ఈ శరీరాన్నే మనిషి అనుకొంటున్నాం. ఈ శరీరం కృశించి నశించిన తరువాత, దీని భాగాలు మట్టిలో కలసిపోయిన తరువాత వాటిని మళ్ళీ ఒక్కచోట చేర్చి ఎలా శరీరాకృతి ఇవ్వడం సాధ్యం అని అనుమానిస్తున్నాం. నిన్నటి వరకు బ్రతికి ఉన్న మనిషికి అకస్మాత్తుగా మరణం సంభవించడం మనం చూస్తునే ఉన్నాం. మరణించి అతడు మాట పలుకు లేకుండా మారిపోతాడు, అతనిలో కదలికలు ఉండవు. అతడి శక్తి సామర్థ్యాలన్నీ నశించిపోతాయి. ఆ తరువాత భూమిలో సమాధి అయిపోతాడు. లేదా కొన్ని జాతుల వారి ఆచారాల ప్రకారం దహనం చేయబడతాడు. బూడిదగా మారి నదుల్లో కలుపబడతారు. ఈ విధంగా ఖననం, దహనం వల్ల ఆకారం నశిస్తుంది. అతడి ఉనికి

మనకు కానరాకుండా పోతుంది. బ్రతికి ఉండిన మనుష్యుల జీవితాలు ఇలా ముగియడాన్ని మనం రోజూ చూస్తునే ఉన్నాం. అయితే మరణించిన మనిషి మళ్ళీ ఎలా లేస్తాడన్నది మనకు అర్థం కావడం లేదు.

మన అసలు ఉనికి మన ఈ శరీరం కాదు. మనం చూస్తున్న ఈ నడుస్తూ తిరుగుతూ ఉండే శరీరం కాదు మన నిజమైన ఉనికి. కళ్ళకు కనబడని శరీరం లోపల దాగి ఉన్నది నిజమైన మనిషి. ఆ మనిషే ఆలోచిస్తున్నాడు. శరీరాన్ని కదలిస్తున్నాడు. ఆ మనిషి లోపల ఉండటం వల్లనే శరీరం బ్రతికి ఉంటుంది. ఆ మనిషి శరీరాన్ని వదిలిన తరువాత శరీరంలో జీవం ఉండదు.

వాస్తవమేమంటే మనిషి అంటే పైకి కనబడే కాయం కాదు. కాయం లోపల ఉండే ఆత్మ పేరు మనిషి, మనిషి శరీరం అనేక చిన్న చిన్న కణాలతో నిర్మితమైంది. ఈ కణాలను జీవకణా (Living Cells) లని అంటారు. ఇంటి నిర్మాణంలో ఇటుకల పాత్ర ఎలాంటిదో మన శరీరంలో ఈ జీవకణాల పాత్ర అలాంటిదే మన శరీరంలోని ఈ జీవకణాలు నిత్యం శారీరక కదలికల కారణాన నశిస్తూ ఉంటాయి. వీటిని మనం ఆహారం ద్వారా తిరిగి సమకూర్చుకొంటున్నాం. ఆహారం జీర్ణమై వివిధ జీవ కణాలుగా రూపొందుతుంది. శరీరంలో నశించిన కణాల స్థానాన్ని పూరిస్తుంది. ఈ విధంగా మనిషి శరీరం నిత్యం మారుతూ ఉంటుంది. పాత కణాలు నశిస్తూ ఉంటాయి. వాటి స్థానంలో కొత్త జీవకణాలు చేరుతూ ఉంటాయి. ఇలా ప్రతి రోజూ జరుగుతూ ఉంటుంది. చివరకు కొంత కాలం తరువాత పూర్తి శరీరంలోని కణాలు మార్పునొంది క్రొత్త కణాలు శరీరంలో చేరి ఉంటాయి. పూర్తి శరీరమే కొత్తదై ఉంటుంది. ఇలా పదేళ్ళలోగా పూర్తి శరీరం మారిపోతుంటుంది. మరోవిధంగా చెప్పాలంటే పదేళ్ళ క్రితం ఉన్న మన

శరీరం నేడు ఉండదు. పదేళ్ళ తరువాత పూర్తిగా కొత్త శరీరం ఉంటుంది. పదేళ్ళలో మన శరీరంలో నశించిపోయిన కణాలన్నింటిని ఒక్కచోట చేర్చితే మన శరీరాన్నే పోలిన మరో శరీరాన్ని రూపొందించి నిలబెట్టవచ్చు. అంటే నూరేళ్ళ మనిషిని పోలిన పది శరీరాలు రూపొందిచవచ్చు. ఈ శరీరాలు చూడడానికి ఒకలా ఉంటాయి. కాని జీవిం మాత్రం ఉండదు. ఈ శరీరాల్లో 'మనిషి' ఉండడు. ఎందుకంటే మనిషి తన పాత శరీరాలను వదిలి కొత్త శరీరాలను తన కోసం నిర్మించుకొంటూ వస్తున్నాడు.

ఈ విధంగా శరీరం మార్పులు చెందుతూ ఉన్నప్పటికీ మనలో ఎలాంటి మార్పు రాదు. మనిషి ఎలాంటి వాడలానే ఉంటాడు. మీరు పదేళ్ళ ముందు ఎవరితోనన్నా ఏదైనా ఒప్పందం చేసుకొని ఉంటే ఆ ఒప్పందాన్ని 'మీరే' చేశారని పదేళ్ళ తరువాత కూడా ఒప్పుకుంటారు.. నిజం చెప్పాలంటే మీ పాత శరీరం పదేళ్ళ తరవాత మిగిలిలేదు. ఒప్పందంపై సంతకాలు చేసింది. చేసిన ఆ పాత చేతులు కావు, నేడు మీకు ఉన్నవి కొత్త చేతులు, ఒప్పందం గురించి చర్చించిన పాత నాలుక నేడు లేదు. నేటి నాలుక క్రొత్తది. కాని మీరు మాత్రం పాత మనిషే, పదేళ్ళ తరువాత మీరే ఒప్పందం చేసుకొన్నారని అంగీకరిస్తారు. ఆ ఒప్పందం మీదేనని ఒప్పుకొంటారు. శరీరంతో పాటు మార్పునొందని లోపలి మనిషి ఇతడే. శరీరం ఎన్ని మార్పులను పొందినా ఈ మనిషి ఎలాంటి వాడలాగే ఉంటాడు.

దీన్నిబట్టి తెలిసేదేమిటంటే మనిషి అనేది కేవలం కాయం పేరు కాదు. శరీరం నశించినంత మాత్రాన మనిషి నశించడానికి వీలులేదు. మనిషి అన్నది శరీరం పేరు కాదు. మనిషి అన్నది శరీరానికి భిన్నంగా తన ఉనికిని నిలబెట్టుకొనే ఆత్మ పేరు. శారీరిక భాగాలు నశించినప్పటికీ ఈ ఆత్మకు మనుగడ ఉంటుంది. శరీరం మార్పునొందటం, ఆత్మ మారకపోవటం

వల్ల శరీరం అశాశ్వతం అని, ఆత్మ శాశ్వతమని స్పష్టంగా తెలియవస్తుంది.

జీవన్మరణాలన్నవి కొన్ని భౌతిక కణాలు ఒకచోట ఏర్పడటం, మళ్ళీ నశించిపోవడం వల్ల సంభవిస్తున్నాయని కొందరు అమాయకులు భావిస్తారు. కొన్ని కణాల కలయిక వల్ల జీవం ఏర్పడుతుందని, ఆ కణాలు కృశించడం వల్ల మరణం సంభవిస్తుందని వారి భావన.

కాని ఈ భావన ఆధారరహితమైనది. హేతు విరుద్ధమైనది. కేవలం కొన్ని కణాల కలయికే జీవం అయినట్లయితే ఆ కణాలు కలసి ఉన్నంత కాలం జీవం కొనసాగాలి. అంతేకాదు, ఈ కణాలను కలపడం ద్వారా శాస్త్రవేత్తలు జీవాన్ని సాధించగలగాలి. కాని ఈ రెండు పనులు అసాధ్యమని మనకు తెలుసు.

మరణించేవారిలో అన్ని రకాల వాళ్ళు ఉంటారు. అన్ని వయసుల వాళ్ళు ఉంటారు. కొందరు ఆరోగ్యవంతులైన వాళ్ళకు కూడా అకస్మాత్తుగా గుండె నొప్పి వస్తుంది. ఎందుకు వచ్చిందన్నది డాక్టర్లు కూడా చెప్పలేరు. మరణించిన వాని శరీరం బ్రతికి ఉన్నప్పటివలెనే పడుకొని ఉంటుంది. మరోమాటలో చెప్పాలంటే వివిధ కణాలన్ని పాత స్థితిలోనే కలసి ఉన్నాయి, కాని ఆ శరీరంలో ఆత్మ లేదు. శరీరంలో బ్రతికి ఉన్నప్పటివలెనే కణాలన్నీ ఉన్నప్పటికీ ఆత్మ లేననందువల్లన జీవం ఉండదు. దానివల్ల తెలిసేదేమంటే భౌతికమైన కణాల కలయిక జీవాన్ని సృష్టించదు. జీవమన్నది శరీరానికి భిన్నంగా ఉనికిలో ఉంటుంది.

సజీవుడైన మనిషిని లేబరీటరీలో తయారు చేయలేం. కాని శరీరాకృతిని చేయగలరు. బ్రతికివున్న మనిషి శరీరంలోని భాగాలు కూడా మామూలు రసాయనిక కణాలు, అణువులే అన్నది నేడు అందరికీ తెలుసు. శరీరంలో ఉన్న కార్బన్ అణవులే బొగ్గులోనూ ఉన్నాయి. హైడ్రోజన్ ఆక్సిజన్

పరమాణువులు నీటి అణువుల్లో ఉన్నవే శరీరంలోనూ ఉన్నాయి. శరీరంలో నైట్రోజన్ పరమాణువులు, వాతావరణంలో ఉన్న నైట్రోజన్ పరమాణువులు ఒక్కటే. ఇలాగే మిగిలిన కణాలన్ని మామూలు అణువులే. అయితే జీవంతో ఉన్న మనిషి కేవలం మామూలు అణువుల ప్రత్యేక కలయిక మాత్రమేనా? అసాధారణ రీతిలో కలుపడిన అణువుల ఏర్పాటు మాత్రమేనా? లేక అంతకుమించిన మరో వాస్తవం ఉందా? మనిషి శరీరం ఏ ఏ కణాలతో ఎలా నిర్మితమైందో శాస్త్రవేత్తలకు తెలుసు కాని ఆయా కణాలను అదే నిష్పత్తిలో చేర్చి మనిషిని జీవంతో రూపొందించలేరని శాస్త్రవేత్తలు ఒప్పుకొంటారు. మరోమాటలో చెప్పాలంటే బ్రతికివున్న మనిషి శరీరం కేవలం కొన్ని కణాల కలయిక మాత్రమే కాదు. అణువులు, జీవం రెండు కలసి ఉన్నది సజీవంగా ఉన్న మనిషి శరీరం మరణించిన తరువాత అణువులతో కూడిన దేహం అయితే మన ముందు ఉంటుంది. కాని జీవం దాన్ని వదిలి మరో లోకంలోకి వెళ్ళిపోతుంది.

పై విశ్లేషణ వల్ల, జీవం నశించేది కాదని, శాశ్వతంగా ఉండేదని తెలుస్తుంది. మరణానంతర జీవితం ఉందన్న సిద్ధాంతం ఎంత సహజమైనదో, బుద్ధికి అందేదో ఇప్పుడు మనం తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. మరణానికి ముందు కనబడేది మాత్రమే జీవితం కాదని, మరణానంతరం కూడా జీవితం ఉందన్నది వాస్తవం. ఈ ప్రపంచం అశాశ్వతమని మన బుద్ధి అంగీకరిస్తుంది. అయితే మనిషి మాత్రం ఈ ప్రపంచం తరువాత కూడా ఉంటాడు. మరణించిన తరువాత మనిషి నిజానికి సమసిపోడు. మరో లోకంలో జీవించడానికి వెళతాడు. ప్రస్తుత ప్రపంచంలో మన జీవితం, మన శాశ్వత జీవితంలోని ఓ భాగం మాత్రమే.

## మరో ప్రపంచం

మరణానంతర జీవితం ఎలా ఉంటుంది? దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సెలవిచ్చినట్లు, స్వర్గ నరకాలు నరకాలు ఉన్నాయి. మరణించిన ప్రతి మనిషి ఈ రెంటిలో ఏదో ఒక దానిలో ప్రవేశిస్తాడు. ఇక్కడి ప్రపంచంలో దైవాదేశాలను పాటించిన వ్యక్తికి, పుణ్యకార్యాలు చేసిన వ్యక్తికి స్వర్గం లభిస్తుంది. చెడు నడతతో, దైవాదేశాలను ఉల్లంఘించిన వ్యక్తిపై నరక శిక్ష పడుతుంది.

ఈ స్వర్గ నరకాల గురించి మరింత వివరంగా అర్థం చేసుకోడానికి ఆలోచిద్దాం.

మనిషి చేసే ప్రతి పనికి రెండు విలువలు ఉన్నాయి. ఒకటి: ఆ పని మామూలుగా జరిగే అనేక సంఘటనలలాగా అది ఓ సంఘటన కావచ్చు. రెండు: ఓ ప్రత్యేక ఉద్దేశ్యంతో ఆ పని చేయడం. మొదటి స్థాయి పనిని యాదృచ్ఛికం అనవచ్చు.రెండవది ఉద్దేశ్యపూర్వకమైనది. అది ఎలాగంటే, ఏదైనా చెట్టుకొమ్మల్లో ఓ రాయి ఇరుక్కొని ఉందనుకోండి. మీరు ఆ చెట్టు క్రింద నుంచి వెళుతున్నప్పుడు ఆ రాయి జారి మీ మీద పడి, మీ తలకు గాయమైతే, మీరు చెట్టుతో ఘర్షణ పడరు. చెట్టుమీద కోపాన్ని తెచ్చుకోరు. తలపట్టుకొని కర్మనుకొని ఇంటికి వెళ్ళిపోతారు.

అలాకాక , మీ పై కావాలని ఎవరైనా రాయి విసరి కొడితే, ఆ రాయి దెబ్బ వల్ల మీరు గాయపడినట్లయితే మీరు ఆ వ్యక్తిపై విరుచుకుపడతారు. వాడి తలబ్రద్దలు చేయాలనుకొంటారు.

చెట్టుకి మనిషికి మధ్య ఈ తేడా ఎలాంటిది? చెట్టుపై నుంచి రాయి పడితే మీరు ప్రతీకారం ఎందుకు తీర్చుకోరు? మనిషి కొడితే బదులు తీర్చుకోవాలని ఎందుకు అనుకొంటున్నారు? కారణం స్పష్టం. మనిషిలా చెట్టుకి ఆలోచించే శక్తి లేదు. చెట్టు మీది నుంచి రాయి పడటం కేవలం యాదృచ్ఛికం. అయితే మనిషి వల్ల జరిగే పనుల్లో యాదృచ్ఛికమైనవీ ఉ

ంటాయి. ఉద్దేశ్యపూర్వకమైనవీ ఉంటాయి.

అంటే మనిషి వల్ల జరిగే పని రెండు విభిన్న విలువలు కలిగి ఉంటుంది. ఒకటి, అతగాడి పని వల్ల ప్రపంచమంతటా ఓ సంఘటన జరుగుతుంది.. రెండు, అతడి పని ధర్మబద్ధంగా లేదా ధర్మవిరుద్ధంగా ఉండటం. సదుద్దేశ్యంతో చేయబడిన పని కావడం లేదా దురుద్దేశ్యంతో చేయబడినది కావడం అవుతుంది.

మొదటి విలువకు సంబంధించినంత వరకు పని వల్ల జరిగిన సంఘటనకు ఫలితం ఈ ప్రపంచంలోనే కనబడుతుంది. అయితే, రెండవ విలువకు సంబంధించిన ఫలితం ఈ ప్రపంచంలో కనబడదు. ఎప్పుడైనా ఫలితం కనబడినా అది అతి స్వల్ప శాతం మాత్రమే. మీపై రాయి విసిరిన మనిషి పని వల్ల మొదటిస్థాయి ఫలితం వెంటనే కనబడింది. మీ తలకు గాయమైంది. అయితే అతడి ఆ పని రెండవ స్థాయికి – అంటే తన శక్తిని దుర్వినియోగపరచిన – ఫలితం వెంటనే కనబడవలసిన అవసరం లేదు. ఆ వ్యక్తి మీ తల బ్రద్దలు కొట్టాలని ఆ పని చేశాడు. ఫలితంగా మీ తలకు గాయమైంది. ఆ వ్యక్తి ఓ చెడు పని చేయాలనుకొన్నాడు. అయితే దాని ఫలితం మాత్రం వెంటనే కనబడలేదు. మనిషి చేసే పనిలోకి మొదటి స్థాయి–అంటే యాదృచ్ఛిక ఘటన–ఫలితం వెంటనే బయల్పడి పోతుంది. అలాంటప్పుడు రెండవ స్థాయి – ఉద్దేశ్యాల – ఫలితం కూడా వెంటనే బయల్పడాలి కదా!

ప్రళయం అనేది మానవ కర్మల ఈ రెండవ స్థాయి ఫలితం సంపూర్ణంగా బయల్పడే రోజు. మనిషి పనుల వల్ల కొన్ని సంఘటనలు జరిగినట్లే అతడి పని మరికొన్ని సంఘటనలకు కారణమవుతుంది. ఈ రెండు రకాల సంఘటనలకు మధ్య భేదమేమంటే, మొదటి రకం సంఘటనలను

ఇక్కడ ఈ ప్రపంచంలోనే చూస్తాం. రెండవ రకం సంఘటనలను మరణానంతరం చూస్తాం.

ప్రపంచంలో జీవిస్తున్న ప్రతి మనిషి తన కర్మల ద్వారా తన కోసం ఏదో ఒక ప్రతిఫలాన్ని సృష్టించుకోవడంలో మునిగి ఉన్నాడు. సోమరిగా కూర్చున్నవాడయినా, లేక పనిలో మునిగిపోయి ఉన్నవాడైనా ఎవరైనా, ఎలాంటి పరిస్థితిలో ఉన్నవాడయినా, ప్రతి ఒక్కడు తన కోసం ఓ ప్రతిఫలాన్ని – కానుకో, శిక్షో – సృష్టించుకొంటున్నాడు. మనిషి అలవాట్లు, నైతికతల ఆధారంగా అతడి గురించి ప్రజలు ఓ అభిప్రాయాన్ని ఏర్పరచుకొంటారు. మనిషి శక్తి సామర్థ్యాలను వినియోగించుకొనే తీరును బట్టి అతడి పని జరగడం, జరగకపోవడం ఆధారపడి ఉంటుంది. ఏ దిశనయితే మనిషి కృషి చేస్తాడో ఆ దిశనున్న వస్తువులే పొందుతాడు. ఇలా ప్రతి మనిషి తన చుట్టుప్రక్కల తన ఆచరణలకు అనుగుణమైన ప్రపంచాన్ని నిర్మించుకొంటున్నాడు. మనిషి కర్మలకు సంబంధించిన ప్రాపంచిక కోణము ఇది. అలాగే మనిషి చేసే పనులకు రెండవ స్థాయి కూడా ఉంది. సదుద్దేశ్యంతో లేదా దురుద్దేశ్యంతో పనిచేసిన స్థాయి. ఈ స్థాయి వల్ల కూడా మనిషికి ప్రతిఫలం లభిస్తుంది. ఈ ప్రతిఫలం పరలోకంలో పేరుకుపోతుంది. మన కర్మలలోని – ఉద్దేశ్యాల– ప్రతిఫలం పరలోకంలో శాశ్వత ప్రతిఫలాన్ని సృష్టిస్తుంది. ధార్మిక పరిభాషలో ఈ ప్రతిఫలాన్ని స్వర్గనరకాలని అంటారు. మనలోని ప్రతి వ్యక్తి అనుక్షణం తన కోసం పరలోకంలో స్వర్గాన్నో లేక నరకాన్నో సృష్టించుకొంటున్నాడు. ఈ ప్రపంచంలోకి మనిషి పరీక్ష కోసం పంపబడ్డాడు కావున అతడికి స్వర్గనరకాలు కనబడనివిగా ఉన్నాయి. పరీక్ష కాలం పూర్తయిన తరువాత, ప్రళయం వచ్చిన పిదప ప్రతి మనిషి అతడు ఈ ప్రపంచంలో ఉంటూ నిర్మించుకొన్న పరలోక నివాసంలోకి పోవడం జరుగుతుంది.

ఇక్కడ తలెత్తే మరో ప్రశ్న ఏమంటే – మనం చేసే పనుల వెనుక ఉన్న ఉద్దేశ్యాలకు ప్రతిఫలం ఉన్నట్లయితే అది మనకెందుకు కనబడదు? ఉదాహరణకు ఇల్లు కట్టడం. ఈ పనిచేస్తే, ఫలతంగా ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. కట్టిన ఇల్లు కనబడుతుంది. ఈ ఫలితాన్ని మనం కళ్ళారా చూడగలం. అయితే ఆ ఇంటిని ధర్మబద్ధంగా నిర్మించామా? లేక ధర్మ విరుద్ధమైన రీతిలో కట్టామా అన్నది కూడా ప్రతిఫలాన్ని సృష్టిస్తే ఆ ప్రతిఫలం ఎక్కడ ఉంది. మనం కళ్ళతో చూడలేని ప్రతిఫలం కూడా ఉంటుందా!

ఈ ప్రశ్నకు జవాబు, ఇంతకు చెప్పిన మానవ కర్మలలోని రెండు స్థాయిల్లో దాగి ఉంది. ప్రతి పనివల్ల జరిగే ఘటనను మనిషి కళ్ళతో చూడగలదు. చివరికి కెమేరాలోని నిర్జీవ నేత్రం కూడా దాన్ని స్పష్టంగా చూడగలదు. అయితే పని వెనుక ఉన్న 'ఉద్దేశ్యాలు' ఎవరికీ కనబడనివి. వాటిని చూడలేము. అందువల్ల ఉద్దేశ్యాల ప్రతిఫలం కూడా కానరానిదే అవుతుంది. మనిషి చేసే పనిలోని మొదటి స్థాయి ప్రతిఫలం ఈ ప్రపంచంలోనే బయల్పడుతుంది. రెండవస్థాయి ప్రతిఫలం పరలోకంలో లభిస్తుంది.

ఇది కేవలం ఉహాగానం కాదు. విశ్వ నిర్మాణాన్ని అధ్యయనం చేస్తే ప్రతి పని వెనుక రెండు రకాల ప్రతిఫలాలు ఉన్నాయని తెలుస్తుంది.

మనకు కనబడే ఫలితాలు, మనకు కానరాకపోయినా ఓ వాస్తవంలా తెలిసివచ్చే ఫలితాలు రెండు విశ్వంలో వాటిల్లుతున్నాయని తెలుస్తుంది. విశ్వంలో అగోచర ఫలితాలు ఉన్నాయన్న, ఇతర ఫలితాలు కూడా ఉన్నాయన్న వాస్తవాన్ని ఈ విషయాలు సూచిస్తున్నాయి.

ఉదాహరణకు శబ్దాన్ని తీసుకోండి. శబ్దం అన్నది ఓ విధమైన తరంగం. దాన్ని కళ్ళతో చూడలేం. మనం మాట్లాడటానికి నాలుకను కదిల్చినప్పుడు ఆ కదలిక వల్ల గాలిలో శబ్ద తరంగాలు పుడతాయి. ఈ

తరంగాలనే మనం శబ్దం అంటాం. మాట్లిడినప్పుడు ఈ తరంగాలు పుడతాయి. ఈ తరంగాలు శాశ్వతంగా ఉండిపోతాయి. శాస్త్రవేత్తల ప్రకారం అయితే నేటికి వేలాది సంవత్సరాలకు పూర్వం మనిషి తన నోటి నుంచి వెలువరించిన శబ్దాలు, మాట్లాడిన మాటలు అన్నీ అలాగే తరంగాల రూపంలో వాతావరణంలో నిక్షిప్తమై ఉన్నాయి. మనం నేడు ఆ శబ్దాలను వినలేకపోతున్నాం. ఆ తరంగాలను చూడలేకపోతున్నాం. అయితే ఆ శబ్దాలను పట్టుకోగలిగిన పరికరాలు కనుక మన వద్ద ఉంటే ఆ శబ్దాలను వేలాది ఏళ్ళ క్రితం విన్నట్లే వినగలం.

ఈ ఉదాహరణ ద్వారా మనం పరలోక జీవితం గురించి చక్కగా అర్థం చేసుకోవచ్చు. మన చుట్టూ వాతావరణం ఉంది. మన నోటి నుంచి వెలువడిన ప్రతి మాట వాతావరణంలో రికార్డు అవుతుంది. నిజానికి మనం గాలిని చూడలేం, మన మాటల రికార్డింగ్‌నూ చూడలేం. ఇదే విధంగా పరలోకం కూడా మనలను చుట్టుముట్టి ఉంది. మన ఉద్దేశ్యాలను, మన భావాలను నిరంతరం రికార్డ్ చేస్తుంది. ఈ పరలోకపు తెరపై మన పనులు రికార్డ్ అవుతున్నాయి. ఈ రికార్డులో దాగిన సమాచారం మరణానంతరం బహిర్గతమవుతుంది. గ్రామఫోనుకి ‘కీ’ ఇచ్చి, దానిపై రికార్డు తిరుగుతూ ఉంటే, చుట్టుప్రక్కల గాలి వ్యాపించి ఉంటే, దానిపై సూది ఉంచిన మరుక్షణం అప్పటి వరకు మౌనంగా ఉన్న రికార్డు ప్లేటు గొంతు విప్పుతుంది. తనపై సూది ఎప్పుడు ఉంచుతారా అని ఎదురుచూస్తున్నట్లు వెంటనే పలకనారంభిస్తుంది. ఇదేవిధంగా మన సమస్త కర్మల రికార్డు తయారవుతుంది. విశ్వప్రభువు ఆజ్ఞాపించిన మరుక్షణం ఆ రికార్డు మన ముందుకు వచ్చేస్తుంది. దాన్ని చూసి మనిషి ‘ఇదేమి పుస్తకం. నేను చేసిన చిన్న పెద్ద కర్మలలో ఒక్కటి కూడా వదలక రికార్డు చేసింది’ అని ప్రతి మనిషి నిశ్చేష్టుడవుతాడు.

# ఆఖరు మాట

పైన పేర్కొన్న అంశాలు మరోసారి మనస్సులో మననం చేసుకోండి. జీవితం అతి పెద్దది. నిరంతరం సాగేది. మరణం అనేది జీవితానికి అంతం కాదు. అది జీవితంలోని రెండవ దశకు ఆరంభం. మన జీవితంలోని రెండు దశల మధ్య విభజన రేఖ మరణం. దీన్ని క్రింది ఉదాహరణతో అర్థం చేసుకోవచ్చు. రైతు నాట్లు నాటిన తరువాత శాయ శక్తుల కృషి చేస్తాడు. పెట్టుబడి పెడతాడు. చివరికి పంట చేతికి వస్తుంది. దాన్ని కోసుకుంటాడు. ధాన్యాల్ని సేకరించి సంవత్సరం పొడవునా ఆహారానికి ఏర్పాట్లు చేసుకొంటాడు. పంటను కోసిన తరువాత దాని ఓ దశ ముగిసిపోతుంది. రెండవ దశ ఆరంభమవుతుంది. మొదటి దశలో నాట్లు వేయడం, శ్రమ పడడం, పంటను కోయడం ఉన్నాయి. రెండవ దశలో పడిన శ్రమకు ప్రతిఫలాన్ని పొందడం, తన అవసరాలు తీర్చుకోవడం ఉన్నాయి. పంటను కోయకముందు అతడికి లభించేది కేవలం శ్రమ మాత్రమే. పంట కోసిన తరువాత శ్రమ ఫలితం పొందడం, దానితో ప్రయోజనాన్ని సాధించుకోవడం ఉన్నాయి.

మన జీవితం కూడా ఇటువంటిదే. మనం ఇహలోకంలో పరలోక పంటను పండించుకొంటున్నాం. మనలో ప్రతి వ్యక్తికి పరలోకంలో అతడి పైరు ఉంది. అందులో ప్రతి మనిషి శ్రమన్నా చేస్తున్నాడు లేక వ్యర్థంగా విడిచి పెడుతున్నాడు. చెడిన విత్తనాలు లేక మంచి విత్తనాలు ప్రతి వ్యక్తి వాడుతన్నాడు. విత్తనాలు చల్లి వ్యర్థంగా వదిలే వాళ్ళున్నారు. లేదా దానిపై శ్రద్ధ చూపుతున్నవాళ్ళు ఉన్నారు. ముళ్ళ కంచెను కొందరు పండిస్తుంటే కొందరు మంచి పళ్ళు పండిస్తున్నారు. కొందరు తమ శక్తియుక్తులన్నింటినీ ఆ పైరుపై వెచ్చిస్తున్నారు. కొందరు ఇతర వ్యర్థ కార్యకలాపాల్లో కాలం వెచ్చిస్తున్నారు. ఈ పంట కాలం మనకు మరణం ఆసన్నమయ్యే వరకు ఉ

ంటుంది. మరణం అనేది పరలోక పంటను కోసుకొనే రోజు. ఈ లోకంలో మన కళ్ళు మూతపడిన నాడు పరలోకంలో మన కళ్ళు తెరుచుకుంటాయి. అక్కడ ఇహలోక జీవితంలో పండించిన పంట మన ఎదురుగా ఉంటుంది.

పంటను కోసే ఆ రోజున పంట కోసం శ్రమ పడినవాడే కోత కోయగలడు. మరణానికి ముందు తాను పండించిన పంటనే కోసుకోగలడు. ప్రతి మనిషికి తెలుసు తాను ఎంత ధాన్యం పండించాడో అంతే ధాన్యం ఇంటికి తీసుకెళ్ళగలడు. ఏది పండించాడో అదే పంట చేతికొస్తుంది. అదే విధంగా ప్రళయ దినాన కూడా మనిషి దేనికోసం శ్రమించాడో అదే దొరుకుతుంది. మరణం అనేది మనిషికి కృషిచేసే కాలం పూర్తయ్యిందన్న ప్రకటన. పరలోకం అనేది మనిషి చేసుకొన్న దానికి ప్రతిఫలం అనుభవించే లోకం. మరణం తరువాత మళ్ళీ శ్రమించే అవకాశం దొరకదు. పరలోకం ముగింపు లేనిది. ఎంత కఠినమైనదీ వాస్తవం. మనిషి మరణానికి ముందే ఈ యదార్థాన్ని తెలుసుకొంటే ఎంత బాగుండు. ఎందుకంటే, మరణానంతరం ఈ వాస్తవాన్ని తెలుసుకుంటే ప్రయోజనం ఏదీ ఉండదు. మరణానంతరం తెలుసుకోవడమంటే మనిషి గతంలో తాను ఎంత ఘోరమైన తప్పు చేశాడని పశ్చాత్తాపపడం తప్ప మరేమీ ఉండదు. తాను చేసిన తప్పును. దిద్దుకొనే వీలు ఉండదు.

మనిషి తన ముగింపును తెలుసుకోలేకపోతున్నాడు. కాగా, కాలం శరవేగంగా మనిషిని ప్రళయదినం వైపునకు నెట్టుతోంది. మనిషి ఇహలోక ప్రయోజనాలు పొందడంలో మునిగిపోయి ఉన్నాడు. పైగా, తానేదో 'పని' చేస్తున్నట్లు భావిస్తున్నాడు. నిజానికి మనిషి తన విలువైన కాలాన్ని వ్యర్థం చేసుకొంటున్నాడు. మనిషి ముందు ఓ అతి గొప్ప అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని మనిషి అత్యంత వైభవోపేతమైన భవిష్యత్తును

నిర్మించుకోగలడు. కాని, మనిషి గులకరాళ్ళతో ఆడుకొంటున్నాడు. విశ్వప్రభువు మనిషిని స్వర్గం వైపు – అత్యంత గౌరవప్రదమైన సుఖప్రదమైన స్వర్గం వైపు పిలుస్తున్నప్పటికీ మనిషి కేవలం కొన్ని రోజుల పాటు ఉండే భోగాలలో చిక్కుకొన్నాడు. ఏదో పొందుతున్నానని మనిషి అనుకొంటున్నాడు. వాస్తవానికి అతడు చాలా పోగొట్టుకొంటున్నాడు. ప్రపంచంలో ఓ ఇల్లు నిర్మించుకొని తన జీవితాన్ని నిర్మించుకొన్నట్లు మురిసిపోతున్నాడు. నిజానికి అతడు ఇసుక మేడలు కడుతున్నాడు. ఈ మేడలు నిర్మితమయ్యేది తరువాత కూలిపోవడానికే.

మనిషీ! "నిన్ను నీవు తెలుసుకో!" నువ్వేం చేయవలసి ఉంది? నువ్వేం చేస్తున్నావు? ఏ మనిషి ఈ వాస్తవాన్ని గ్రహిస్తాడో అతడు తన ప్రభువును గ్రహిస్తాడు. మరణానంతరం జీవితాన్ని అర్థం చేసుకొంటాడు. స్వర్గ ప్రాప్తికి సోపానాలు వేసుకొంటాడు.

**–:సమాప్తం:–**

spiritofislam.co.in cpsglobal.org goodwordbooks.com

**Goodword Quran App**






Goodword

Goodword Books
I, Nizamuddin West Market, New Delhi - 110 013
Tel. +9111-41827083
Mob. +91-8588822672
email : info@goodwordbooks.com
www.goodwordbooks.com
www.mwkhan.com

**Contact : 9394003049, 9573522690**

This pamphlet is copyright free. Goodword gives permision
to translate or publish this pamphlet into any language.

ప్రపంచంలో జీవిస్తున్న ప్రతి మనిషి తన కర్మల ద్వారా తన కోసం ఏదో ఒక ప్రతిఫలాన్ని సృష్టించుకోవడంలో మునిగి ఉన్నాడు. సోమరిగా కూర్చున్న వాడయినా, లేక పనిలో మునిగిపోయి ఉన్న వాడైన ఎవరైనా, ఎలాంటి పరిస్థితిలో ఉన్నవాడయినా, ప్రతి ఒక్కడు తన కోసం ఓ ప్రతిఫలాన్ని – కానుకో, శిక్షో – సృష్టించుకొంటున్నాడు. మన కర్మలలోని – ఉద్దేశ్యాల– ప్రతిఫలం పరలోకంలో శాశ్వత ప్రతిఫలాన్ని సృష్టిస్తుంది. ధార్మిక పరిభాషలో ఈ ప్రతిఫలాన్ని స్వర్గ నరకాలని అంటారు. మనలోని ప్రతి వ్యక్తి అనుక్షణం తన కోసం పరలోకంలో స్వర్గాన్నో లేక నరకాన్నో సృష్టించుకొంటున్నాడు. ఈ ప్రపంచంలోకి మనిషి పరీక్ష కోసం పంపబడ్డాడు. కావున అతడికి స్వర్గనరకాలు కనబడనివిగా ఉన్నాయి. పరీక్ష కాలం పూర్తయిన తరువాత, ప్రళయం వచ్చిన పిదప ప్రతి మనిషి అతడు ఈ ప్రపంచంలో ఉంటూ నిర్మించుకున్న పరలోక నివాసంలోకి పోవడం జరుగుతుంది.


GOODWORD
info@goodwordbooks.com
www.goodwordbooks.com

CPS International
centre for peace & spirituality
info@cpsglobal.org
www.cpsglobal.org